# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచి09 | బుధవారం, 10 సెప్టెంబర్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com




## భారత 15వ ఉప రాష్ట్రపతిగా
# సీపీ రాధాకృష్ణన్

సీపీ రాధాకృష్ణన్‌కు పోలైన 452 ఓట్లు

జస్టిస్ సుదర్శన్ రెడ్డికి పోలైన 300 ఓట్లు

15 ఓట్లు చెల్లనివిగా ప్రకటించిన రిటర్నింగ్ అధికారి

ఆనందంలో బీజేపీ శ్రేణులు

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసంలో ఎన్డీఏ ఎంపీల వేడుకలు

హైదరాబాద్, ప్రజాస్వరం

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో సీపీ రాధాకృష్ణన్ భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. ఇండియా కూటమి అభ్యర్థి బి సుదర్శన్ రెడ్డిని ఓడించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో 781 ఓట్లకు గాను మొత్తం 767 ఓట్లు పోలయ్యాయి. ఎన్డీఏ అభ్యర్థి, మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ 452 మొదటి ప్రాధాన్యత ఓట్లు సాధించారు. ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డికి 300 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. 15 చెల్లని ఓట్లు నమోదయ్యాయి. దీంతో మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ 152 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఎన్డీఏ బలం 427 కాగా.. క్రాస్ ఓటింగ్ జరగడంతో 452 ఓట్లు వచ్చాయి. దీంతో దేశంలోని 15వ ఉపరాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్ నిలిచారు. ఈ విజయంతో బీజేపీ శ్రేణుల్లో ఆనందం వెల్లువిరిసింది. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసంలో ఎన్డీఏ ఎంపీల వేడుకలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఫలితాలు ప్రకటించిన అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జోషి నివాసాన్ని సందర్శిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. కాగా.. ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించిన ఓటింగ్ ఈరోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్లమెంట్ హౌస్‌లో జరిగింది. ప్రధాని నరేంద్ర మోడీ 10 గంటల ..మిగతా 2లో



## విద్యా సంస్థల అభివృద్ధికి
# ₹30 వేల కోట్లివ్వండి

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

గత ప్రభుత్వ అధిక వడ్డీ రుణాలపై లోన్ రీస్ట్రక్చరింగ్ విజ్ఞప్తి

విద్యారంగ అభివృద్ధికి ₹30 వేల కోట్లు కోరిన తెలంగాణ సీఎం

105 యంగ్ ఇండియా స్కూళ్లు, ఉన్నత విద్యా సంస్థల మౌలిక వసతుల ప్రణాళిక

హైదరాబాద్, ప్రజాస్వరం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు. ఈ భేటీలో రాష్ట్రంలోని వివిధ ఆర్థిక, అభివృద్ధి అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, గత ప్రభుత్వం తీసుకున్న అధిక వడ్డీ రుణాలను రీస్ట్రక్చర్ చేయాలని, అలాగే, తెలంగాణలో విద్యారంగ అభివృద్ధికి సహకరించాలని ..మిగతా 2లో

## కాంగ్రెస్ ఎంపీలకు సీఎం దిశానిర్దేశం

ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ వేళ ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి మద్దతు కూడగట్టే ప్రయత్నం

రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలతో అల్పాహార భేటీ, ఓటింగ్‌పై మార్గనిర్దేశం

ఓటింగ్‌కు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ నిర్ణయం

ఎన్డీఏ అభ్యర్థికే టీడీపీ, జనసేన, వైసీపీ మద్దతు

02



## ఆకాశాన్నంటిన బంగారంధరలు

లక్షా 10 వేలు దాటిన 10 గ్రాముల 24 క్యారెట్స్ గోల్డ్

22 క్యారెట్ల ఆర్నమెంట్ గోల్డ్ ధర రూ. 1,01,100

కిలో వెండి ధర రూ. 1,40,000కు చేరిక

02

## ఉపరాష్ట్రపతి ఓటింగ్‌కు దూరంగా
# మూడు పార్టీలు

బీఆర్ఎస్, బీజేడీ, శిరోమణి అకాలీదళ్ కీలక నిర్ణయం

ఎన్డీఏ, ఇండియా కూటములకు సమదూరం అంటున్న పార్టీలు

తెలంగాణలో యూరియా కొరతే కారణమన్న బీఆర్ఎస్

పంజాబ్ వరదలే కారణమని ప్రకటించిన అకాలీదళ్

ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్‌కే విజయావకాశాలు



05

## కోర్టు తీర్పుపై సీఎం చెప్పే
# సమాధానం ఏంటి?

హైకోర్టు తీర్పుపై హరీష్ రావు తీవ్ర స్పందన

హైకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి "చెంపపెట్టు"

సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు

విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల పరిరక్షణపై హరీష్ వ్యాఖ్యలు



05

# టీజీపీఎస్సీకి హైకోర్టు షాక్


గ్రూప్1 జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ రద్దు

పునఃమూల్యాంకనం చేయాలని టీజీపీఎస్సీకి ఆదేశాలు

సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే మూల్యాంకనం జరపాలని స్పష్టీకరణ

ప్రక్రియ పూర్తికి 8 నెలల గడువు విధించిన న్యాయస్థానం

లేనిపక్షంలో మెయిన్స్ పరీక్ష రద్దు తప్పదని హెచ్చరిక




హైదరాబాద్, ప్రజాస్వరం

తెలంగాణ గ్రూప్1 నియామక ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. గ్రూప్1 మూల్యాంకనంపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు మార్చి 10న టీఎస్పీఎస్సీ విడుదల చేసిన జనరల్ ర్యాంకింగ్ జాబితాను, మార్కుల లిస్టును రద్దు చేస్తూ ..మిగతా 5లో



## వైద్య విద్యార్థులకు
# గుడ్ న్యూస్

స్థానికతపై జీవో 33కి తెలంగాణ ప్రభుత్వం సవరణ

బదిలీ ఉద్యోగుల పిల్లలకు నాలుగేళ్ల నిబంధన నుంచి మినహాయింపు

నాలుగు ప్రత్యేక కేటగిరీల విద్యార్థులకు స్థానికులుగా గుర్తింపు

ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యేక అవకాశం

సెప్టెంబర్ 15 నుంచి ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్ ప్రారంభం

02

# నేపాల్‌లో తీవ్ర ఉద్రిక్తత

ఆర్థిక మంత్రిని వీధుల్లో తరిమి కొట్టిన నిరసనకారులు

నేపాల్‌లో మంత్రులపై భౌతిక దాడులు

మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవుబాపై కూడా దాడి

విదేశాంగ మంత్రి అర్జు రాణా దేవుబాపైనా చేయిచేసుకున్న ఆందోళనకారులు

దేశంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసిన ఘటనలు



ఖాట్మండు, ప్రజాస్వరం

నేపాల్‌లో రాజకీయ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. ప్రజల నిరసనలు హింసాత్మకంగా మారి ఏకంగా మంత్రులపై దాడులకు దారితీశాయి. ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌడేల్‌పై ఆందోళనకారులు దాడికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. నిరసనకారులు ఆయన్ను వీధుల్లో వెంబడించి కొట్టడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ ఘటనతో దేశ రాజకీయాల్లో ..మిగతా 5లో

## ఫార్ములా ఈ-కార్ కేసు
# లొట్టపీసు కేసు

02

స్కాం లేదు.. మన్నూ లేదు

ఫార్ములా ఈ-కార్ కేసుపై స్పందించిన కేటీఆర్

ఫార్ములా ఈ-కార్ కేసు లొట్టపీసు కేసు

దూద్ కా దూద్.. పానీ కా పానీ అవ్వాలి

ఒక్కరూపాయి కూడా ఎక్కడా తారుమారు కాలేదు

స్కాం లేదు.. మన్నూ లేదు-కేటీఆర్





# వైద్య విద్యార్థులకు గుడ్ న్యూస్

- వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికతపై జీవో 33కి తెలంగాణ ప్రభుత్వం సవరణ
- బదిలీ ఉద్యోగుల పిల్లలకు నాలుగేళ్ల నిబంధన నుంచి మినహాయింపు
- నాలుగు ప్రత్యేక కేటగిరీల విద్యార్థులకు స్థానికులుగా గుర్తింపు
- ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యేక అవకాశం
- సెప్టెంబర్ 15 నుంచి ఎంబీబీఎస్, బీడీఎస్ కౌన్సెలింగ్ ప్రారంభం

హైదరాబాద్, ప్రజాస్వరం

తెలంగాణలో వైద్య విద్య ప్రవేశాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్థానికతను నిర్ధారించే జీవో నంబర్ 33కు సవరణలు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పుల వల్ల బదిలీలపై ఇతర రాష్ట్రాలకు వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు భారీ ఊరట లభించనుంది. కొత్తగా సవరించిన జీవో ప్రకారం నాలుగు కేటగిరీల విద్యార్థులకు స్థానికత విషయంలో మినహాయింపు కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఆల్ ఇండియా సర్వీసెస్ (తెలంగాణ కేడర్), ఆర్మీ, పోలీస్ సిబ్బంది, ప్రభుత్వ రంగ సంస్థలు, ఏజెన్సీల ఉద్యోగుల పిల్లలు.. తమ తల్లిదండ్రుల ఉద్యోగ బదిలీల కారణంగా రాష్ట్రం వెలుపల చదవాల్సి వచ్చినా, వారిని స్థానికులుగానే పరిగణించనున్నారు. వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదవకపోయినా, తల్లిదండ్రుల ఉద్యోగానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ నాలుగు కేటగిరీలకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ప్రత్యేక అవకాశం కల్పించింది. నేటి నుంచి ఈ నెల 11వ తేదీ వరకు వారు ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం అభ్యంతరాలను స్వీకరించి, ధ్రువపత్రాల పరిశీలన తర్వాత తుది జాబితాను విడుదల చేస్తామని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి తెలిపారు. ఈ సవరణల కారణంగా ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌ను ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నట్లు హెల్త్ యూనివర్సిటీ ప్రకటించింది. మొత్తం నాలుగు విడతల్లో కౌన్సెలింగ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో కలిపి 8,515 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ కళాశాలల్లో 4,090 సీట్లు ఉండగా, 613 సీట్లు అఖిల భారత కోటాకు కేటాయించారు. మిగిలిన సీట్లకు యూనివర్సిటీ కౌన్సెలింగ్ నిర్వహించనుంది.



# ఆకాశాన్నంటిన బంగారం ధరలు

- లక్షా 10 వేలు దాటిన 10 గ్రాముల 24 క్యారెట్స్ గోల్డ్
- 22 క్యారెట్ల ఆర్నమెంట్ గోల్డ్ ధర రూ. 1,01,100
- కిలో వెండి ధర రూ. 1,40,000కు చేరిక

మొదటిపేజీ తరువాయి

బంగారం ధరలు చరిత్రలో ఎన్నడూ లేనంత గరిష్ఠ స్థాయికి చేరాయి. పసిడి ప్రియులకు భారీ షాక్ ఇస్తూ, ధరలు ఆకాశాన్నంటాయి. మంగళవారం ఒక్క రోజే భారీగా పెరిగి, తులం (10 గ్రాములు) స్వచ్ఛమైన బంగారం ధర ఏకంగా రూ. 1,10,000 మార్కును దాటి సరికొత్త రికార్డు సృష్టించింది. వెండి ధరలు కూడా అదే దారిలో పయనిస్తూ కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో మంగళవారం 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం తులంపై రూ. 1,360 పెరిగింది. దీంతో దాని ధర రూ. 1,10,290కి చేరింది. అదేవిధంగా, 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర తులంపై రూ. 1,250 పెరిగి, రూ. 1,01,100 వద్ద ట్రేడ్ అవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నం మార్కెట్లలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. బంగారంతో పాటే వెండి ధరలు కూడా భగ్గుమన్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండిపై ఒక్కరోజే రూ. 3,000 పెరగడంతో, దాని ధర రూ. 1,40,000 వద్దకు చేరింది. దేశ రాజధాని ఢిల్లీలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం తులం ధర రూ. 1,10,440 కాగా, 22 క్యారెట్ల బంగారం రూ. 1,01,250 వద్ద అమ్ముడవుతోంది. అయితే, ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 1,30,000 వద్ద ట్రేడ్ అవుతోంది. ఒకే రోజు ఇంత భారీ స్థాయిలో ధరలు పెరగడంతో, బంగారం కొనాలనుకునే సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ ఎంపీలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

- ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ వేళ ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి
- ఇండియా కూటమి అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి మద్దతు కూడగట్టే ప్రయత్నం
- రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలతో అల్పాహార భేటీ, ఓటింగ్‌పై మార్గనిర్దేశం
- ఓటింగ్‌కు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ నిర్ణయం
- ఎన్డీఏ అభ్యర్థికే టీడీపీ, జనసేన, వైసీపీ మద్దతు

మొదటిపేజీ తరువాయి



ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో మకాం వేశారు. ఇండియా కూటమి తరపున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో ఉన్న తెలుగు వ్యక్తి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డికి మద్దతు కూడగట్టేందుకు ఆయన స్వయంగా రంగంలోకి దిగారు. అయితే, తెలుగు ఆత్మగౌరవం నినాదంతో ఆయన చేసిన విజ్ఞప్తికి తెలుగు రాష్ట్రాల్లోని ఇతర ప్రధాన పార్టీల నుంచి మద్దతు లభించలేదు. ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్‌కు ముందు, మంగళవారం ఉదయం తెలంగాణకు చెందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీలతో సీఎం రేవంత్ రెడ్డి అల్పాహార విందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు వేసే ప్రక్రియపై వారికి దిశానిర్దేశం చేసినట్లు ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. సోమవారం రాత్రే ఢిల్లీ చేరుకున్న రేవంత్, ఇండియా కూటమిలో లేని పార్టీల ఎంపీలను సంప్రదించి, సుదర్శన్ రెడ్డికి అనుకూలంగా ఓటు వేయాలని కోరినట్లు సమాచారం. గతంలో ఎన్టీఆర్ ఇచ్చిన తెలుగు ఆత్మగౌరవం నినాదాన్ని గుర్తుచేస్తూ, తెలుగు వ్యక్తికి దక్కుతున్న ఉన్నత పదవికి పార్టీలకు అతీతంగా మద్దతివ్వాలని రేవంత్ రెడ్డి తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పార్టీలకు పిలుపునిచ్చారు. గతంలో నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, వెంకయ్యనాయుడు వంటి వారికి తెలుగువారంతా ఏకతాటిపై నిలిచిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అయితే, రేవంత్ రెడ్డి పిలుపునకు ఇతర పార్టీల నుంచి సానుకూల స్పందన రాలేదు. తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించింది. మరోవైపు, ఏపీలో అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు ఎన్డీఏలో భాగస్వాములు కావడంతో తమ కూటమి అభ్యర్థి సి.పి. రాధాకృష్ణన్‌కే మద్దతు ఇస్తున్నాయి. ప్రతిపక్ష వైసీపీ కూడా ఎన్డీఏ అభ్యర్థికే మద్దతు ప్రకటించింది. తెలంగాణలో కులగణనపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీకి సుదర్శన్ రెడ్డి నేతృత్వం వహించారు. ఆయన్ను ఇండియా కూటమి అభ్యర్థిగా ఎంపిక చేయడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీకి 8 మంది లోక్‌సభ సభ్యులు, ముగ్గురు రాజ్యసభ సభ్యులు ఉన్నారు. ఏపీ నుంచి పార్లమెంటులో ఆ పార్టీకి ప్రాతినిధ్యం లేదు.

# విద్యా సంస్థల అభివృద్ధికి ₹30 వేల కోట్లివ్వండి

మొదటిపేజీ తరువాయి



సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రిని కోరారు. గత ప్రభుత్వం ఇష్టారీతిగా అధిక వడ్డీలకు తీసుకున్న అప్పులు రాష్ట్ర ప్రభుత్వానికి భారంగా మారాయని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి వివరించారు. ఈ రుణాల చెల్లింపులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, వాటిని తిరిగి చెల్లించడానికి లోన్ రీస్ట్రక్చరింగ్‌కు అనుమతించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో విద్యారంగం అభివృద్ధికి కేంద్రం అండగా నిలబడాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ముఖ్యంగా, యంగ్ ఇండియా స్కూల్స్, ఇతర విద్యా సంస్థల అభివృద్ధికి ₹30 వేల కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో సుమారు 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే యంగ్ ఇండియా స్కూల్స్ పథకం ముఖ్య ఉద్దేశ్యం. రాష్ట్రంలోని 105 శాసనసభ నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నామని, ఇప్పటికే నాలుగు పాఠశాలల నిర్మాణ పనులు మొదలయ్యాయని, మిగతా పాఠశాలలకు సంబంధించి టెండర్లు ముగిశాయని ఆయన తెలిపారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఉందని, మొత్తం 2.70 లక్షల మంది విద్యార్థులు ఈ పాఠశాలల్లో లబ్ధి పొందుతారని చెప్పారు. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు, స్టేడియాలతో నిర్మించే ఈ 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి ₹21 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అలాగే, రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో ఆధునిక ల్యాబ్‌లు, మౌలిక వసతుల కల్పనకు ₹9 వేల కోట్లు అవసరమని సీఎం తెలిపారు. ఈ నిధుల సమీకరణ కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు అనుమతించడంతో పాటు, FRBM పరిమితి నుంచి మినహాయింపు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. విద్యా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న వ్యయాన్ని పెట్టుబడిగా పరిగణించాలని కూడా ఆయన కేంద్ర మంత్రిని అభ్యర్థించారు.



# భారత 15వ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాకృష్ణన్

మొదటిపేజీ తరువాయి

సమయంలో తొలి ఓటు వేశారు. అనంతరం ఎంపీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 781 మందిలో మొత్తం 768 మంది ఎంపీలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వాస్తవానికి.. భారత పార్లమెంటులో లోక్‌సభ, రాజ్యసభతో సహా మొత్తం 788 మంది ఎంపీలు ఉండాలి. ప్రస్తుతం రెండు సభలలో 7 సీట్లు ఖాళీగా ఉన్నాయి. అయితే.. మొత్తం 781 మంది ఎంపీలు ఓటు వేయాల్సి ఉంటుంది. వారిలో 13 మంది ఓటింగ్‌లో పాల్గొనలేదు. వీరిలో బీఆర్ఎస్ నుంచి 4, బీజేడీ నుంచి 7 మంది, శిరోమణి అకాలీదళ్ నుంచి ఒకరు, మరో స్వతంత్ర ఎంపీ ఓటు వేయలేదు. ఎన్డీఏకు చెందిన 427 మంది ఎంపీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# ఫార్ములా ఈకార్ కేసు లొట్టపీసు కేసు

- స్కాం లేదు.. మన్నూ లేదు
- ఫార్ములా ఈ-కార్ కేసుపై స్పందించిన కేటీఆర్
- ఫార్ములా ఈ-కార్ కేసు లొట్టపీసు కేసు
- దూద్ కా దూద్.. పానీ కా పానీ అవ్వాలి
- ఒక్కరూపాయి కూడా ఎక్కడా తారుమారు కాలేదు
- స్కాం లేదు.. మన్నూ లేదు- కేటీఆర్

హైదరాబాద్, ప్రజాస్వరం



ఫార్ములా ఈకార్ రేస్ కేసుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఈ కేసు 'లొట్టపీసు కేసు' అని, ఇందులో ఎలాంటి స్కాం జరగలేదని ఆయన అన్నారు. ఒకవేళ అవకతవకలు జరిగాయని నిరూపిస్తే ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని ఆయన పేర్కొన్నారు. ఈ కేసుపై ఏసీబీ విచారణ గురించి ప్రస్తావిస్తూ, "దూద్ కా దూద్, పానీ కా పానీ అవ్వాలి" అని, ఇందులో ఒక్క రూపాయి కూడా తారుమారు కాలేదని ఆయన స్పష్టం చేశారు. "స్కాం లేదు, మన్నూ లేదు" అని ఆయన అన్నారు. నా మీద ఎన్ని కేసులు పెట్టినా, లై డిటెక్టర్ టెస్ట్ చేసినా సిద్ధమని సవాల్ విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను ఓడించాలని అశోక్ నగర్‌లో చెప్పిన మాటలను నమ్మి ఓటు వేసిన ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. గ్రూప్ 1 నోటిఫికేషన్‌లో 500 పోస్టులు ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 60 పోస్టులు కలిపి కొత్త నోటిఫికేషన్ ఇచ్చిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో గ్రూప్ 1 పేపర్ లీక్ అయిన వెంటనే పరీక్షను రద్దు చేశామని, కానీ కాంగ్రెస్ హడావుడిగా పరీక్ష నిర్వహించిందని అన్నారు. ఇందులో అవకతవకలు జరిగాయని, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరిగిందని, కోర్టుకు వెళ్లిన అభ్యర్థులకు కోర్టు శుభవార్త వినిపించిందని ఆయన తెలిపారు. రీవాల్యుయేషన్ చేసినా న్యాయం జరగదని, మళ్లీ పరీక్ష నిర్వహించాలని, నిజం నిగ్గుతేల్చడానికి సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, కమిషన్ వేసి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతున్నారని, మంత్రులు 70 వేలు, లక్ష అని వేర్వేరుగా చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఇచ్చిన ఉద్యోగాలకు కూడా మళ్లీ ఎల్బీ స్టేడియంలో సమావేశం పెట్టి సర్టిఫికెట్లు ఇచ్చి తామే ఇచ్చామని చెబుతున్నారని విమర్శించారు. మొన్న అసెంబ్లీని 15 రోజులు నిర్వహించాలని అడిగితే కేవలం రెండు రోజులే పెట్టారని, మరోసారి అసెంబ్లీ నిర్వహించి ప్రజలకు ఇచ్చిన హామీలపై చర్చించాలని కోరారు. నిరుద్యోగ యువత కోసం ప్రత్యేక అసెంబ్లీ సెషన్ పెట్టాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ రెండు ఉద్యోగాలు ఊడగొడితే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి వెళ్లిపోయారని, నిరుద్యోగులను మళ్లీ కలిసింది లేదని, వారి గురించి ఆలోచించిందే లేదని అన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సీఎం స్పందించి రీఎగ్జామ్ పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పోరాటం చేస్తున్న యువతపై, అశోక్ నగర్‌లో ఆందోళన చేస్తున్న వారిపై పెట్టిన కేసులను బేషరతుగా విత్‌డ్రా చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చివరగా, "లొట్టపీసు కేసు, లొట్టపీసు సీఎం" అని వ్యాఖ్యానిస్తూ, "లీకులు ఇచ్చి ఎన్ని రోజులు బ్రతుకుతారు" అని ప్రశ్నించారు.



## విద్యార్థులకు సిపిఆర్ వివిధ రకాల ప్రథమ చికిత్సలపై అవగాహన

**శామీర్ పేట సెప్టెంబర్ 9(ప్రజాస్వరం)**

తూముకుంట మున్సిపల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తూముకుంటలో జీవీకే పాఠశాల కొంపల్లి వారి ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల విద్యార్థులకు సిపిఆర్ వివిధ రకాల ప్రథమ చికిత్సలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జీవికే పాఠశాల ప్రిన్సిపల్ ఉషా రెడ్డి, డాక్టర్ సతీష్ వారి టీం పాల్గొని విద్యార్థులకు అనేక రకాల ప్రథమ చికిత్సల పై అవగాహన కల్పించడం జరిగింది .స్నేక్ బైట్, ఫిట్స్ కార్డియాకారస్ట్, యాక్సిడెంట్ అగ్ని ప్రమాదాలుపై విద్యార్థులకు అవగాహన కల్పించి పాఠశాలకు ఫస్ట్ ఎయిడ్ కిట్టు పాఠశాలకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు నాగశారద ప్రత్యేకంగా వారిని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుమలేష్, మహేష్, వనజ, వరలక్ష్మి శ్రీనివాసరెడ్డి, పద్మప్రియ, భాగ్యరేఖ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



## తూముకుంట మున్సిపల్ లో ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు

- **నివాళి అర్పించిన జిల్లా ఆర్టీఏ మెంబర్ బిమిడి జైపాల్ రెడ్డి**
- **కార్మికులకు ఈఎస్ఐ హెల్త్ కార్డులు, సబ్బులు పంపిణీ.**

**శామీర్ పేట సెప్టెంబర్ 9(ప్రజాస్వరం)**

శ్రీ కాళోజీ నారాయణరావు 111వ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో ఘన నివాళి. ప్రజాకవి, తెలంగాణ ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణరావు 111 వ జయంతి సందర్భంగా తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన మున్సిపల్ కమిషనర్ ఏంఎన్ఆర్. జ్యోతి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా రీజినల్ ట్రాన్స్పోర్ట్ అథారిటీ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి తదితరులు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాళోజీ తెలంగాణ సంస్కృతి, భాష, ప్రజాస్వామ్యం, ప్రజల హక్కుల కోసం నిబద్ధతతో కొనసాగిన నాయకుడు అని గుర్తు చేశారు. కాళోజీ రచనలు సామాన్యుల జీవితాన్ని ప్రతిబింబిస్తూ, సామాజిక సమస్యలపై చైతన్యం కలిగించాయి. మహానుభావుల జీవితం మనందరికీ ఆదర్శంగా నిలవాలని, ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రావణ్ కుమార్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ కన్నేశ్వర్ రావు, వార్డు ఆఫీసర్లు,మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా 100వ రోజులో భాగముగా పురపాలక సంఘ కార్యాలయం వద్ద సిబ్బంది అందరితో సమావేశం ఏర్పాటు చేసి ఈ 100 రోజుల కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి సిబ్బందికి పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతూ శామీర్ పేట సిబ్బందికి ఈఎస్ఐ కార్డులు, సబ్బులు నూనెలు అందజేయడం జరిగింది. తదుపరి పురపాలక సంఘ పరిధిలోని ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చిన వారికి మున్సిపల్ కమిషనర్ కృతజ్ఞతలు తెలుపుతూ వారికి అన్ని విధాలుగా సహకరిస్తామని తెలియజేశారు.







# చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

- **క్రీడలను ప్రారంభించిన డీఈవో**

**మెదక్ సెప్టెంబర్ 09 (ప్రజా స్వరం)**

పాఠశాల క్రీడల సమైక్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడా పోటీలు మంగళవారం మెదక్ జిల్లా కేంద్రం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరిగింది. ఇందులో 14 రకాల విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు ఈ మేరకు ఈ పోటీలకు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల గ్రౌండ్ వేదికైంది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధా కిషన్ పాల్గొని క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఉన్నత విద్యలు రిజర్వేషన్ కల్పించేందుకు ప్రశంస పత్రాన్ని అందించనున్నట్లు తెలిపారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం తో పాటు శరీరంగా దృఢత్వానికి తోడ్పడుతుందని అన్నారు. జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాటు చేశామని, ఈ క్రీడలు ఈ నెల 19 వ తేదీ వరకు జరగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఫ్ కార్యదర్శి నాగరాజు, పీఈటీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాస్, మాధవరెడ్డి, నరేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.




## లక్ష్మాపూర్ లో మంగళ వాయిద్యాలతో వినాయకుని నిమజ్జనం!



**శామీర్ పేట సెప్టెంబర్ 9(ప్రజాస్వరం)**

మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లక్ష్మాపూర్ గ్రామంలో వినాయకుని నిమజ్జనం అంగరంగ వైభవముగా జరిగింది. గ్రామంలో తిమ్మాపూర్ రోడ్డుకు వున్న స్వామిని మంగళ వాయిద్యాలతో ఆడపడచులందరు మంగళ హారతులు ఇచ్చి వీడ్కోలు పలికారు. వినాయకుణ్ణి గ్రామస్తులందరు భక్తి శ్రద్ధలతో పూజించి ఆధ్యాత్మిక భావన వుట్టిపడేలా శివాజీ యూత్ వారు పలు కార్యక్రమాలు నిర్వహించారు. యువనాయకుడు క్యాతం మధుకృష్ణ మాట్లాడుతూ ప్రముఖ సిద్ధాంతి పి.వి.సీతారామచార్యుల సలహాతో మంగళవాయిద్యముల కారక్రమముతో నిమజ్జనాన్ని సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించామని, భవిష్యత్తులో కూడా ఇంకా సాంప్రదాయ పద్ధతులలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అందరి సహకారముతో ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి సహకరించిన దాతలకు, విధ్యుత్ సిబ్బందికి, పోలీస్ సిబ్బందికి, మున్సిపల్ సిబ్బందికి శాలువాతో సత్కరించి సన్మానం చేసారు. ఈ కార్యక్రమము విజయవంతం కావడానికి సహకరించిన గ్రామ పెద్దలకు, మహిళలకు యూత్ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమములో గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు, యువజన సంఘ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.



## జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం

- **టియుడబ్ల్యూజె యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు**

**శామీర్ పేట సెప్టెంబర్ 9(ప్రజాస్వరం)**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి యూనియన్ ఎల్లప్పుడూ పోరాటం చేస్తుందని టీయూడబ్ల్యూజే మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు జి.బాల్ రాజ్, ప్రధాన కార్యదర్శి జి.వెంకట్ రాంరెడ్డిలు అన్నారు. శామీర్ పేట ప్రెస్ క్లబ్ లో మంగళవారం జరిగిన టీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు 21మంది పూర్తి చేసిన సభ్యత్వ నమోదు ఫారంలను వారు స్వీకరించారు. యూనియన్ లో సభ్యత్వ నమోదు చేసుకున్న సభ్యులకు ఐడి కార్డు, జిల్లా డైరీ, భావస్వేచ్ఛ మాసపత్రిక అందజేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన పాత్రికేయులకు అక్రిడియేషన్ కార్డులు, విలేకరుల కుటుంబాలకు ఉచిత వైద్య శిభిరం ఏర్పాటు చేస్తమని వారు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వాసలమర్రి నర్సింహా రావు, ఎస్. వెంకటరెడ్డి, జిల్లా నాయకులు దేశం కృష్ణ, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు క్యాతం రవి, మాజీ అధ్యక్షులు ఆర్.భూపాల్, ప్రధాన కార్యదర్శి బత్తుల ప్రభాకర్ యాదవ్, ఉపాధ్యక్షులు మంచాల శేఖర్, సింగం పవన్ కుమార్, కార్యవర్గ సభ్యులు శ్రీహరి, రవీందర్ గౌడ్, మేడి యాదగిరి అలియాస్ (చిన్న), శ్రవణ్ కుమార్, సభ్యులు రవి గౌడ్, శ్రీనివాస్, బాలకృష్ణ పాల్గొన్నారు.

# ప్రజల కోసం నిత్యం పరితపించిన కవితామూర్తి కాళోజి: మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి




**శామీర్ పేట సెప్టెంబర్ 9(ప్రజాస్వరం)**

ప్రజల కోసం నిత్యం పరితపించిన కవితామూర్తి కాళోజి ఆశయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శమని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా యువజన క్రీడా శాఖ ఆధర్యంలో ఏర్పాటు చేసిన కాళోజీ జయంతిని పురస్కరించుకొని కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగ కలెక్టరు మాట్లాడుతూ తెలంగాణ మాండలికానికి నిలువుటెత్తు నిదర్శనం కాళోజీ అని అన్నారు. పుట్టుక నీది, చావు నీది బతుకంతా దేశానిది అన్న కాళోజి మాటలు అందరికి ఆదర్శమని అన్నారు. తెలంగాణ ప్రజల కోసం తన కలం ద్వారా తెలంగాణ భాష, యాస ఎంత మంచిగుంటుందో రాసి మరీ చూపించారని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా తుమ్మలరాజు జన్మదిన వేడుకలు



**మనోహరబాద్ (ప్రజా స్వరం)**

కాళ్లకల్ ఉపసర్పంచ్ తుమ్మలరాజు యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.మనోహరబాద్ మండల కేంద్రం లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు , గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి , ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ మాజీ ఛైర్మెన్ , ఫుడ్స్ మాజీ ఛైర్మెన్ గంగూమల్ల ఎలక్షన్ రెడ్డి, కోనాయి పల్లి మాజీ సర్పంచ్ లు సుధాకర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బీజేపీ నాయకులు పురం మహేష్ ముదిరాజ్, మాజీ వైస్ ఎంపీపీ విఠల్ రెడ్డి, నాచారం ఆలయ కమిటీ ఛైర్మెన్ రవీందర్ గుప్తా, నాయకులు దుర్గేష్ యాదవ్, రవీందర్ రెడ్డి, మహేష్ యాదవ్, మనోహరాబాద్ మాజీ సర్పంచ్ ఐలయ్య యాదవ్, నాచారం ఆలయ కమిటీ మాజీ చైర్మెన్ నర్సింహా గౌడ్, నాగులపల్లి మాజీ చైర్మెన్ శ్రీశైలం యాదవ్, మనోహరాబాద్ మాజీ ఎంపీటీసీ కృష్ణగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లద్దిపేర్ల శ్రీనివాస్ గౌడ్ లతోపాటు పలు రాజకీయ పార్టీ నాయకులు, ఆయన అభిమానులు భారీగా తరలివచ్చి శాలువాలతో సత్కరించి స్వీట్లు తినిపించి జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలుతెలిపారు. ప్రజలకు సేవలందించి మరింత ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు.



## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ



**శామీర్ పేట, సెప్టెంబర్ 9 (ప్రజాస్వరం) :**

శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద జగిత్యాల జిల్లా కోరుట్ల వాస్తవ్యులు కీ. శే. మిర్యాల కిషన్ రావు జ్ఞాపకార్థం ఆయన భార్య మిర్యాల నీరజ, కుమారులు రామ్మోహన్ రావు కీర్తి దంపతులు, ప్రవీణ్ రావు ప్రభ దంపతులు, వెంకటేశ్వరరావు ఉమా దంపతులు, మనుమలు అశ్విత్ రావు, రామ్ అంకితరావు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.



# పౌష్టికాహార సామాగ్రిని ఎక్స్పైరీ డేట్ పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలి


- **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**

**శామీర్ పేట సెప్టెంబర్ 9(ప్రజాస్వరం)**

చిన్నారులకు ఇచ్చే బాలామృతం, పౌష్టికాహార సామాగ్రిని ఎక్స్పైరీ డేట్ పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆదేశించారు. మంగళవారం శామీర్ పేట్ మండలంలోని ఉప్పర్ పల్లిలోని అంగన్ వాడీ కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తాతో కలిసి జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ కేంద్రంలోని బాలామృతం ప్యాకెట్లను పరిశీలించి ఎక్స్పైరీ డేట్ చేక్ చేసి డేట్ ముగిసే లోపు వినియోగించుకోవాలని, అదనంగా ఉంటే వేరే కేంద్రాలకు ఇవ్వాలని జిల్లా సంక్షేమాధికారికి సూచించారు. వంటగదిని, వంటి సామాగ్రిని కలెక్టర్ పరిశీలించి, గర్భిణులకు, చిన్నారులకు ఏమి ఏమి భోజనం ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్రంలోని పిల్లలు ఆడుకునే ఆట వస్తులను పరిశీలించి, ఎండ తగలకుండా పైన షెడ్ ఏర్పాటు చేస్తే పిల్లలు ఆడుకుంటారని సూచించారు. కేంద్రంలో ఎంత మంది విద్యార్థుల, గర్భిణులు ఉన్నారని ఆరా తీసారు. పిల్లల ఆట వస్తులను పరిశీలించి ఇంకా ఏమైన అవసరమైతే ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నారులతో ముచ్చటిస్తూ వారు చదివి వినిపించే ఆటలు, పాటలను కలెక్టర్ విన్నారు. గర్భిణులతో మాట్లాడుతూ భోజనం ఎలా ఉంటుందని, ఏ టైంకి భోజనం ఇస్తున్నారని ఆరా తీసారు. ఈ పర్యటనలో శామీర్ పేట్ తహాసీల్దార్ యాదగిరిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి శారద, తూంకుంట మున్సిపల్ కమీషనర్ జ్యోతి, ఆంగన్ వాడీ టీచర్లు, తదితరులు పాల్గొనారు.







# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి




**శామీర్ పేట, సెప్టెంబర్ 9 (ప్రజాస్వరం)**

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శామీర్ పేట కు చెందిన పర్వతాపురం హరిబాబు (35) తన ద్విచక్ర వాహనంపై సోమవారం రాత్రి ఇంటికి వస్తుండగా నల్సార్ చౌరస్తాలో తూంకుంట వైపు నుంచి మజీద్ పూర్ వైపు వెళ్తున్న బొలెరో టి ఎస్ 08 యుజి 3283 వాహనం హరిబాబును ఢీ కొట్టింది. ఆ బొలెరో వాహనం సుమారు 20 మీటర్ల దూరం వరకు బైక్‌ను లాగుతూ వెళ్ళింది. బొలెరో డ్రైవర్ వాహనం వదిలి అక్కడి నుంచి పారిపోయాడు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొగా హరిబాబు వాహనం కింద ఇరుక్కుని ఉండడం చూసి బోరున విలపించారు. సంఘటన స్థలానికి చేరుకున్న108 అత్యవసర వాహనం సిబ్బంది హరిబాబును పరిశీలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు శామీర్ పేట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.





# శివపార్వతుల ఆలయం నిర్మాణానికి నిధులు సేకరణ

మన్యం జిల్లా, బర్ 9 (ప్రజాస్వరం )

కొమరాడ మండలం :, కొమరాడ గ్రామం ఈశాన్యం దిశగా నాగావళి నది తీరంలో శివపార్వతుల 11 అడుగుల విగ్రహ నిర్మాణం( పైన ఊహ చిత్రం చూపబడింది) జరుగుతున్నది కావున యావన్మంది భక్తులు అందరూ విరాళ రూపంలో సహకరించవలసిందిగా కోరుచున్నాము. చుట్టుపక్కల గ్రామస్తులు అందరూ సందర్శించి ఈ దైవకార్యాన్ని తమకు తోచిన విరాళాలతో సహకరించి శివపార్వతుల విగ్రహ నిర్మాణంలో ముందుకు నడుపుతారని కోరుకుంటున్నాం ఆ శివపార్వతుల ఆశీర్వాదాలు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం



# కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కురుపాం ఎమ్మెల్యే

మన్యం జిల్లా, ప్రజాస్వరం

నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనముగా నిర్మించిన హాస్పటల్ భవనాన్ని మంగళవారం నాడు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ , డిసిహెచ్ఎస్ నాగభూషణరావు తో కలిసి ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయకజగదీశ్వరి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు వినోద్, ఎంపీడీవో ఉమామహేశ్వరి, వైద్యులు, వైద్య సిబ్బంది, టిడిపి మండల కన్వీనర్ కె.వి కొండయ్య, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, బత్తిలి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.



# ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

మన్యం జిల్లా , (ప్రజాస్వరం )

కురుపాం నియోజకవర్గం, జియ్యమ్మవలస మండలంలో చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నాడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ప్రభుత్వ విప్ & కురుపాం ఎమ్మెల్యే, హాస్పిటల్ చైర్ పర్సన్ తోయక జగదీశ్వరిహాజరయ్యారు. హాస్పిటల్ లో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం ఆసుపత్రిలో ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ నాగభూషణరావు, జియమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ, వైసీపీ, జనసేనపై షర్మిల ఫైర్

- ఆర్ఎస్ఎస్ వాదికి ఓటు వేయించిన మూడు పార్టీల అధ్యక్షులు చరిత్రహీనులు: షర్మిల
- తెలుగు బిడ్డకు కాకుండా బీజేపీ అభ్యర్థికి ఓటేశారని విమర్శ
- మోదీ ప్రయోజనాల కోసమే మూడు పార్టీలు పనిచేశాయని ఆరోపణ
- జగన్ తన కేసుల నుంచి బయటపడేందుకే కేంద్రానికి దాసోహమన్న షర్మిల
- రాష్ట్ర ప్రయోజనాలను చంద్రబాబు, పవన్ తాకట్టు పెట్టారని ధ్వజం

హైదరాబాద్, ప్రజాస్వరం



ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఏపీలోని ప్రధాన పార్టీల వైఖరిపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలుగు వ్యక్తి అయిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వకుండా, బీజేపీఆర్ఎస్ఎస్ అభ్యర్థికి ఓటు వేయడం ద్వారా టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు తెలుగు జాతికి తీరని ద్రోహం చేశాయని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఈ చర్యను తెలుగు జాతికి చీకటి రోజుగా ఆమె అభివర్ణించారు. "తెలుగు జాతికి నేడు చీకటి రోజు. ఆత్మగౌరవమే అజెండా అని టీడీపీ, పదవుల కన్నా జాతి ప్రయోజనం ముఖ్యమని జనసేన, తెలుగే లెస్స అని చిలక పలుకులు పలికిన వైసీపీ... తెలుగు జాతికి చేసింది నేడు తీరని ద్రోహం. రాజకీయాలకు అతీతంగా, అత్యున్నత పదవికి తెలుగు బిడ్డ పోటీ పడితే, ఆర్ఎస్ఎస్ వాదికి ఓటు వేయించిన మూడు పార్టీల అధ్యక్షులు చరిత్రహీనులు. తెలుగు ప్రజల ప్రయోజనాల కన్నా.. స్వలాభమే ధ్యేయంగా.. మత పిచ్చి మోదీ గారికి మోకాళ్లొత్తడమే లక్ష్యంగా టీడీపీ, వైసీపీ, జనసేన చేసిన నీచ రాజకీయాలను చరిత్ర ఎన్నటికీ క్షమించదు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీఆర్ఎస్ఎస్ అభ్యర్థికి టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు ఓటు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలుగు బిడ్డ, న్యాయ నిపుణుడు జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారికి ఓటు వేయకపోవడం అత్యంత బాధాకరం. తెలుగు పార్టీలు తెలుగు బిడ్డకు మద్దతుగా నిలవకపోవడం అత్యంత దురదృష్టకరం. జాతీయ స్థాయిలో తెలుగు జాతికి జరిగిన ఘోర అవమానం. చంద్రబాబు గారిని, జగన్ మోహన్ రెడ్డి గారిని, పవన్ కల్యాణ్ గారిని సూటిగా ప్రశ్నిస్తున్నాం. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కంటే మోదీ గారితో స్వప్రయోజనమే మీకు ముఖ్యమా...? పోటీలు పడి మోదీ దగ్గర మోకరిల్లాల్సిన ఖర్మ ఎందుకు పట్టింది..? రాష్ట్రానికి బీజేపీ చేసిన మోసం మీకు కనిపించలేదా...? 10 ఏళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని నమ్మించి గొంతు కోసిన విధానం గుర్తుకు రాలేదా...? ఢిల్లీని మించిన రాజధాని కడతామని 11 ఏళ్లుగా దగా పడ్డామని అనిపించలేదా...? రాష్ట్ర జీవనాడి పోలవరంలో జీవం తీసేస్తే మీలో చలనం లేదా...? విశాఖ స్టీల్ ను పబ్లిక్ గా అమ్ముతుంటే మీకు రోషం లేదా...? దీనికి చంద్రబాబు, పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి. మీరు ఎలాగో కీలుబొమ్మలు... కనీసం సుదర్శన్ రెడ్డి గారిని గెలిపించుకుంటే రాష్ట్రం గురించి అడిగే స్వరం ఢిల్లీలో ఉండేదన్న సోయి లేకపోవడం బాధాకరం. కూటమి పార్టీలతో తోడుగా పోటీపడి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసినందుకు వైసీపీ సిగ్గుపడాలి. ప్రతిపక్షంలో ఉంటూ, ప్రతిపక్షాల అభ్యర్థిని కాదని అధికార పక్షానికి మద్దతు ఇవ్వడం ప్రపంచంలోనే ఇదొక వింత. ఇక రాష్ట్రంలో వైసీపీకి ప్రతిపక్షం, ప్రజల పక్షం అని చెప్పుకోవడానికి అర్హత లేదు. అపోజిషన్ ముసుగులో రాష్ట్రంలో జగన్ గారు కూడా బీజేపీ పక్షమే. బీజేపీకి అవసరమైనపుడు పనికొచ్చే పక్షమే. ఐదేళ్లలో దోచుకున్నది దాచుకోవడానికి కేంద్రానికి బానిస అయ్యారు. కేసులకు భయపడి మోదీ గారికి దాసోహం అన్నారు. తనను తాను రక్షించుకునేందుకు దత్తపుత్రుడిగా అవతారం ఎత్తి తెలుగు జాతికి జగన్ గారు నేడు చేసింది తీరని ద్రోహమే" అంటూ షర్మిల నిప్పులు చెరిగారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నిక ఓటింగ్‌కు దూరంగా మూడు పార్టీలు

- బీఆర్ఎస్, బీజేడీ, శిరోమణి అకాలీదళ్ కీలక నిర్ణయం
- ఎన్డీఏ, ఇండియా కూటములకు సమదూరం అంటున్న పార్టీలు
- తెలంగాణలో యూరియా కొరతే కారణమన్న బీఆర్ఎస్
- పంజాబ్ వరదలే కారణమని ప్రకటించిన అకాలీదళ్
- ఎన్డీఏ అభ్యర్థి రాధాకృష్ణన్‌కే విజయావకాశాలు

మొదటిపేజీ తరువాయి

దేశవ్యాప్తంగా ఆసక్తి రేపుతున్న ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్‌లో కీలక పరిణామం చోటు చేసుకుంది. మూడు ప్రాంతీయ పార్టీలు ఈ ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించాయి. తెలంగాణకు చెందిన భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్), ఒడిశాకు చెందిన బిజూ జనతా దళ్ (బీజేడీ), పంజాబ్‌కు చెందిన శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) ఓటింగ్‌లో పాల్గొనకూడదని ప్రకటించాయి. ఈ మూడు పార్టీలు ఏ కూటమికీ మద్దతు ఇవ్వకుండా తటస్థంగా నిలవనున్నాయి. తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ప్రకటించారు. పార్టీకి రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. రైతుల సమస్యల నేపథ్యంలోనే తాము ఈ ఎన్నికలో ఎవరికీ మద్దతివ్వకుండా, తటస్థంగా ఉండాలని నిర్ణయించుకున్నామని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సమదూరం పాటించే తమ విధానంలో భాగంగానే ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నట్లు బీజేడీ ప్రకటించింది. ఆ పార్టీకి రాజ్యసభలో ఏడుగురు ఎంపీలు ఉన్నారు. ఈ మేరకు పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ సస్మిత్ పాత్ర తెలిపారు. ఇక, పంజాబ్‌లో వరదల కారణంగా తాము ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు అకాలీదళ్ వెల్లడించింది. ఆ పార్టీకి లోక్‌సభలో ఏకైక ఎంపీగా అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ సతీమణి హర్సిమ్రత్ కౌర్ ఉన్నారు. ఈ మూడు పార్టీలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నప్పటికీ, ఫలితాలపై పెద్దగా ప్రభావం చూపే అవకాశం లేదు. ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ సునాయాసంగా గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రతిపక్షాల తరఫున బి. సుదర్శన్ రెడ్డి పోటీలో ఉన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల ఎలక్టోరల్ కాలేజీలో మొత్తం 781 మంది సభ్యులు ఉండగా, గెలుపునకు 391 ఓట్లు అవసరం. లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల బలంతో ఎన్డీఏ కూటమికి స్పష్టమైన ఆధిక్యం ఉంది.జగ్దీప్ ధన్‌ఖడ్ ఆరోగ్య కారణాలతో తన పదవికి జులై 21న రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. రహస్య బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరుగుతుండగా, ఏమైనా క్రాస్ ఓటింగ్ జరుగుతుందా అనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ సాయంత్రానికి ఫలితం వెలువడనున్నాయి.

# కోర్టు తీర్పుపై సీఎం చెప్పే సమాధానం ఏంటి?

- హైకోర్టు తీర్పుపై హరీష్ రావు తీవ్ర స్పందన
- హైకోర్టు తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి “చెంపపెట్టు”
- సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు
- విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల పరిరక్షణపై హరీష్ వ్యాఖ్యలు


హైదరాబాద్, ప్రజాస్వరం

గ్రూప్ 1 మెయిన్స్ పరీక్ష ఫలితాలను రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు మంగళవారం సంచలన తీర్పు ఇచ్చిన తర్వాత బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్ర స్పందన ప్రకటించారు. హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వానికి “చెంపపెట్టు”గా అభివ్యక్తం చేస్తూ, సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. సోషల్ మీడియా వేదికగా (‘ఎక్స్’) తన పోస్టులో హరీష్ రావు పేర్కొన్నారు, “గ్రూప్ 1 పరీక్ష మూల్యాంకనంలో అవకతవకలు, పరీక్ష కేంద్రాల కేటాయింపు, హాల్ టికెట్ల జారీ, ఫలితాల్లో అనుమానాలు, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో హైకోర్టు నేడు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు. రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంతో విద్యార్థులు, నిరుద్యోగులు బలవుతున్నారు. ఇప్పటికీ కండ్లు తెరువు, సిగ్గుతో తలదించుకో, తెలంగాణ యువతకు క్షమాపణ చెప్పు,” అని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. హైకోర్టు తీర్పు ప్రకారం, గ్రూప్ 1 మెయిన్స్ ఫలితాలను రద్దు చేసి, మెయిన్స్ పేపర్స్‌ను తిరిగి మూల్యాంకనం చేయాల్సి ఉంది. రీవాల్యుయేషన్ కోసం 8 నెలల వ్యవధి ఇచ్చి, అది సాధ్యం కానప్పుడు పునరాయించాల్సిందిగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఈ విధంగా, హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వం ముందు సక్రమ చర్యలు తీసుకోవాలని స్పష్టంగా సూచించింది.

# టీజీపీఎస్సీకి హైకోర్టు షాక్

మొదటిపేజీ తరువాయి

సంచలన తీర్పు వెలువరించింది. గ్రూప్ 1 సమాధాన పత్రాలను మళ్లీ మూల్యాంకనం చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)ని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ పునఃమూల్యాంకనం తప్పనిసరిగా సంజయ్ సింగ్ వర్సెస్ యూపీఎస్సీ కేసులో సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగానే జరగాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం ప్రక్రియను ఎనిమిది నెలల్లోగా పూర్తి చేయాలని గడువు విధించింది. ఒకవేళ నిర్దేశిత సమయంలోగా పునఃమూల్యాంకనం పూర్తి చేయని పక్షంలో గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలనే రద్దు చేయాల్సి వస్తుందని హైకోర్టు హెచ్చరించింది. గ్రూప్ 1 మూల్యాంకనంలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ కొందరు అభ్యర్థులు.. ఇప్పటికే ఎంపిక ప్రక్రియ చివరి దశలో ఉందని, నియామకాలను రద్దు చేయవద్దని ఎంపికైన మరికొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్లపై జులై 7న జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ఇరుపక్షాల వాదనలు విన్నారు. వాదనలు ముగిసిన అనంతరం, న్యాయస్థానం తాజాగా ఈ కీలక తీర్పును వెలువరించింది. ఈ తీర్పుతో గ్రూప్ 1 అభ్యర్థులలో మళ్లీ ఉత్కంఠ నెలకొంది.




# నేపాల్‌లో తీవ్ర ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

ఒక్కసారిగా అలజడి మొదలైంది. మంత్రులపై దాడులకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా ఆందోళనకారులు పెద్ద సంఖ్యలో వీధుల్లోకి వచ్చారు. ఈ క్రమంలో ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌడేల్ వారికి కనిపించడంతో ఒక్కసారిగా చుట్టుముట్టారు. ఆయన వీధుల్లో పరుగెడుతుండగా ఆందోళనకారులు దాడి చేస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఆయన పరుగెడుతుండగా ఎదురుగా వచ్చిన ఒక యువకుడు ఎగిరి తన్నిన దృశ్యం కూడా వీడియోలో కనిపించింది. నిరసనకారుల నుంచి తప్పించుకోవడానికి మంత్రి మళ్లీ లేచి పరుగెత్తారు. ఈ దాడులు ఆర్థిక మంత్రికే పరిమితం కాలేదు. నేపాల్ మాజీ ప్రధానమంత్రి షేర్ బహదూర్ దేవుబా, ఆయన భార్య, ప్రస్తుత విదేశాంగ శాఖ మంత్రి అర్జు రాణా దేవుబాలను కూడా నిరసనకారులు లక్ష్యంగా చేసుకున్నారు. వీరిపై కూడా ఆందోళనకారులు దాడికి పాల్పడ్డారు.





# తెలంగాణలో సీన్ రివర్స్

- **చంద్రబాబుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రశంసలు**
- **ఏపీకి ప్రధాని మోదీ లక్షల కోట్లు కేటాయించారన్న మల్లారెడ్డి**
- **తెలంగాణలో రియల్ ఎస్టేట్ పరిస్థితి బాగాలేదని ఆవేదన**
- **తెలంగాణ వారే ఏపీలో పెట్టుబడి పెడుతున్నారన్న ఎమ్మెల్యే**
- **మళ్లీ కేసీఆర్ వస్తేనే తెలంగాణకు పాత రోజులు వస్తాయని ధీమా**
- **పుట్టినరోజునాడు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మల్లారెడ్డి**

హైదరాబాద్, ప్రజాస్వరం

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రశంసలు కురిపించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ లక్షల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారని, చంద్రబాబు వాటిని సమర్థంగా వినియోగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఉదయం తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం మందగించిందని, పరిస్థితి పూర్తిగా తలకిందులైందని అన్నారు. "గతంలో ఏపీలో ఆస్తులు అమ్ముకుని హైదరాబాద్ వచ్చేవారు. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. తెలంగాణకు చెందినవారే ఇప్పుడు ఏపీలో ఆస్తులు కొంటున్నారు, వ్యాపారాలు చేస్తున్నారు" అని ఆయన వివరించారు. ప్రతి ఏటా తన పుట్టినరోజునాడు స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ అని మల్లారెడ్డి తెలిపారు. గతేడాది తాను యూనివర్సిటీలు కావాలని స్వామిని కోరుకున్నానని, ఇప్పుడు దేశంలోనే మూడు పెద్ద డీమ్డ్ యూనివర్సిటీలను నడుపుతున్నానని గుర్తు చేసుకున్నారు. అదే సమయంలో తెలంగాణలోని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా ఆయన మాట్లాడారు. "కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణలో దేశంలో ఎక్కడా జరగనంత అభివృద్ధి జరిగింది. కేటీఆర్ ఎన్నో మల్టీ నేషనల్ కంపెనీలను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తేనే తెలంగాణకు ఆ పాత రోజులు తిరిగి వస్తాయి" అని మల్లారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.



# నెల రోజుల్లో ఐదుగురి మృతి

- **కేరళలో అమీబిక్ మెనింగోఎన్సెఫలిటిస్ కలకలం**
- **కోజికోడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తాజాగా మహిళ మృతి**
- **ప్రస్తుతం 11 మందికి చికిత్స.. ఈ ఏడాది 42 కేసులు**
- **మురికి నీటిలో స్నానంతో వ్యాపిస్తున్న ఇన్ఫెక్షన్**
- **ప్రభుత్వం నుంచి వైద్యులకు ప్రత్యేక మార్గదర్శకాలు**

హైదరాబాద్, ప్రజాస్వరం

కేరళలో అరుదైన మెదడు ఇన్ఫెక్షన్ తీవ్ర కలకలం రేపుతోంది. 'అమీబిక్ మెనింగో ఎన్సెఫలిటిస్' అనే ఈ వ్యాధి కారణంగా కేవలం నెల రోజుల వ్యవధిలోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. కలుషిత నీటిలో ఉండే అమీబా వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మలప్పురం జిల్లా వండూర్‌కు చెందిన శోభన (56) అనే మహిళ ఈ వ్యాధితో చికిత్స పొందుతూ కోజికోడ్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో తాజాగా మరణించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ఎంత ప్రయత్నించినా ప్రాణాలు కాపాడలేకపోయారు. సరిగ్గా రెండు రోజుల క్రితమే సుల్తాన్ బతేరికి చెందిన రతీష్ (45) అనే వ్యక్తి కూడా ఇదే ఆసుపత్రిలో ఇదే వ్యాధితో మృతి చెందారు. అతనికి గుండె సంబంధిత సమస్యలు కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆగస్టులో ముగ్గురు ఈ వ్యాధికి బలవగా, తాజా మరణాలతో కలిపి కేవలం నెల రోజుల్లో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో మరో 11 మంది ఈ ఇన్ఫెక్షన్ లక్షణాలతో చికిత్స పొందుతున్నట్టు వైద్యారోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 42 కేసులు నమోదైనట్టు వారు ధ్రువీకరించారు. కలుషితమైన నీటిలో స్నానం చేయడం లేదా ఈత కొట్టడం వల్ల ఈ అరుదైన ఇన్ఫెక్షన్ సోకుతుందని ఆరోగ్య శాఖ అధికారులు వివరిస్తున్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, వ్యాధి చికిత్సకు సంబంధించి వైద్యులకు ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేశారు. ప్రజలు కలుషిత నీటి వనరులకు దూరంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# రహస్య కెమెరాలు మీ ఫోన్ తోనే కనిపెట్టొచ్చు!

- **హోటల్ గదుల్లో పెరిగిపోతున్న రహస్య కెమెరాల కలకలం**
- **సాధారణ వస్తువుల్లోనే కెమెరాలను అమర్చి నిఘా పెడుతున్న వైనం**
- **మీ స్మార్ట్‌ఫోన్ ఫ్లాష్‌లైట్, కెమెరాతోనే సులభంగా గుర్తించే పద్ధతులు**
- **వై-ఫై నెట్‌వర్క్‌ను స్కాన్ చేయడం ద్వారా అనుమానిత డివైజ్‌ల గుర్తింపు**
- **టూ-వే అద్దాలను కనిపెట్టేందుకు సులభమైన వేలిముద్ర టెక్నిక్**
- **అనుమానం వస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయడం ముఖ్యం**

హైదరాబాద్, ప్రజాస్వరం



విహార యాత్రకో, పని మీదో వేరే ఊరు వెళ్లినప్పుడు మనం ఒక్కోసారి హోటళ్లు, లాడ్జిల్లో బస చేస్తుంటాం. అయితే, మనకు తెలియకుండానే ఓ జత కళ్లు మనల్ని గమనిస్తుంటే? ఈ ఆలోచనే ఒళ్లు గగుర్పొడిచేలా చేస్తుంది కదూ! నేటి టెక్నాలజీ యుగంలో ఇది కేవలం ఊహ కాదు, కఠినమైన వాస్తవం. హోటల్ రూమ్‌లు, డ్రెస్సింగ్ రూమ్‌లు, చివరికి ఎయిర్‌బీఎన్‌బీ అద్దె ఇళ్లలో కూడా రహస్య కెమెరాలు బయటపడుతున్న ఘటనలు మనల్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. అయితే, కొన్ని సులభమైన జాగ్రత్తలతో ఈ ప్రమాదం నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు. కొన్ని సులభమైన పద్ధతులను అనుసరించి, మన ప్రైవేట్ క్షణాలకు భంగం కలగకుండా చూసుకోవచ్చు.

**మీ కళ్లతోనే స్కాన్ చేయండి**

మొదటగా, మీరు గదిలోకి ప్రవేశించిన వెంటనే చుట్టూ ఉన్న వాతావరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించండి. కొన్ని వస్తువులు వాటి సాధారణ ప్రదేశంలో కాకుండా కాస్త కొత్తగా, అసహజంగా కనిపిస్తున్నాయేమో గమనించండి. ముఖ్యంగా స్మోక్ డిటెక్టర్లు, అలారం గడియారాలు, ఎలక్ట్రికల్ సాకెట్లు, గోడలకు తగిలించిన ఫొటో ఫ్రేమ్‌లు, టీవీ, సెట్‌టాప్ బాక్స్‌లు, షోకేజ్‌లోని బొమ్మలు, పూల కుండీలు వంటి వాటిపై దృష్టి పెట్టండి. ఏదైనా వస్తువు మిగతా వాటితో పోలిస్తే కొత్తగా ఉన్నా, దాని స్థానం కాస్త తేడాగా అనిపించినా, దానిని దగ్గరగా పరిశీలించడం చాలా ముఖ్యం. కొన్నిసార్లు చిన్నపాటి రంధ్రాలు లేదా అసాధారణ వైర్లు కూడా రహస్య కెమెరా ఉనికిని సూచిస్తాయి.

**స్మార్ట్‌ఫోన్ అద్భుతం**

దాదాపు ప్రతి ఒక్కరి దగ్గర ఉండే స్మార్ట్‌ఫోన్, ఈ విషయంలో ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది. ముందుగా గదిలోని లైట్లన్నీ ఆపేసి, చిమ్మచీకటిగా చేయండి. ఇప్పుడు మీ ఫోన్ ఫ్లాష్‌లైట్ ఆన్ చేసి, గదిలోని ప్రతీ మూలను, అనుమానం ఉన్న వస్తువులను నెమ్మదిగా స్కాన్ చేయండి. కెమెరా లెన్స్ కాంతిని పరావర్తనం చెందిస్తుంది (రిఫ్లెక్ట్ చేస్తుంది). కాబట్టి, ఎక్కడైనా చిన్నగా మెరుపులాంటిది కనిపించిందంటే అక్కడ కెమెరా ఉండే అవకాశం ఉంది. మరో శక్తివంతమైన పద్ధతి ఇన్‌ఫ్రారెడ్ (IR) లైట్లను గుర్తించడం. చాలా రహస్య కెమెరాలు రాత్రిపూట స్పష్టంగా రికార్డ్ చేయడానికి ఇన్‌ఫ్రారెడ్ టెక్నాలజీని వాడతాయి. ఈ కాంతి మన కంటికి కనిపించదు. గదిని చీకటి చేసి, మీ స్మార్ట్‌ఫోన్ కెమెరాను ఆన్ చేసి, అనుమానాస్పద ప్రదేశాల వైపు తిప్పండి. ఫోన్ స్క్రీన్‌పై ఎక్కడైనా ఊదా లేదా తెలుపు రంగులో చిన్న చుక్కలా వెలుగు కనిపిస్తే, అది కచ్చితంగా ఇన్‌ఫ్రారెడ్ లైట్లను వెదజల్లుతున్న రహస్య కెమెరా అని నిర్ధారించుకోవచ్చు.

**నెట్‌వర్క్, సిగ్నల్స్ పరిశీలన**

వైర్‌లెస్ కెమెరాలు పనిచేయాలంటే అవి వైఫై నెట్‌వర్క్‌కు కనెక్ట్ అవ్వాల్సిందే. మీ ఫోన్‌లోని వైఫై సెట్టింగ్స్‌లోకి వెళ్లి, అందుబాటులో ఉన్న నెట్‌వర్క్‌లను స్కాన్ చేయండి. మీకు తెలియని లేదా అనుమానాస్పద పేర్లతో ఏవైనా డివైజ్‌లు కనెక్ట్ అయి కనిపిస్తే, అది రహస్య కెమెరా కావచ్చు. మరింత కచ్చితత్వం కోసం ప్లే స్టోర్‌లో లభించే నెట్‌వర్క్ స్కానర్ యాప్‌లను ఉపయోగించవచ్చు. కొంచెం ఖర్చు చేయగలిగితే, రేడియో ఫ్రీక్వెన్సీ (RF) సిగ్నల్ డిటెక్టర్‌ను కొనుగోలు చేయడం ఉత్తమం. ఇవి డేటాను ప్రసారం చేస్తున్న కెమెరాలు, మైక్రోఫోన్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి వచ్చే సిగ్నల్స్‌ను గుర్తిస్తాయి. ఈ డిటెక్టర్‌తో గది మొత్తం స్కాన్ చేస్తే, ఎక్కడైనా కెమెరా ఉన్నప్పుడు అది బీప్ శబ్దం లేదా లైట్ల ద్వారా హెచ్చరిస్తుంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

కొన్నిసార్లు గదుల్లో, ముఖ్యంగా బాత్రూమ్‌లలో టూవే అద్దాలను అమర్చి కెమెరాలను దాచిపెట్టవచ్చు. దీనిని పరీక్షించడానికి, మీ వేలి కొనను అద్దంపై ఉంచండి. మీ వేలికి, దాని ప్రతిబింబానికి మధ్య ఖాళీ కనిపిస్తే అది సాధారణ అద్దం. అలా కాకుండా, మీ వేలు, ప్రతిబింబం ఒకదానికొకటి తాకుతున్నట్టు, మధ్యలో ఎలాంటి ఖాళీ లేకుండా కనిపిస్తే అది టూవే అద్దం అయ్యే ప్రమాదం ఉంది. ఒకవేళ ఈ పద్ధతులన్నీ పాటించినా మీకు ఇంకా అనుమానం పోకపోతే, నిపుణుల సహాయం తీసుకోవడం మంచిది. ప్రొఫెషనల్ ఏజెన్సీలు ప్రత్యేక పరికరాలతో గదిని స్కాన్ చేసి, ఎలాంటి నిఘా పరికరాలు ఉన్నా గుర్తిస్తాయి. ఒకవేళ మీరు రహస్య కెమెరాను గుర్తిస్తే, దానిని ముట్టుకోవద్దు. వెంటనే దాన్ని ఫోటో తీసి, హోటల్ యాజమాన్యానికి, పోలీసులకు ఫిర్యాదు చేయండి. మీ ప్రైవసీ మీ హక్కు. కాస్త అవగాహన, అప్రమత్తతతో వ్యవహరిస్తే, ప్రశాంతంగా మీ ప్రయాణాన్ని ఆస్వాదించవచ్చు.

# సోషల్ మీడియాపై నిషేధంతో నేపాల్‌లో తీవ్ర స్థాయిలో నిరసనలు

- **హింసాత్మకంగా మారిన ఆందోళనలు, పలువురి మృతి**
- **నేపాల్ కు చీకటిరోజు అన్న మనీషా కొయిరాలా**

హైదరాబాద్, ప్రజాస్వరం

పొరుగు దేశం నేపాల్‌లో రాజకీయ సంక్షోభం తారస్థాయికి చేరింది. సోషల్ మీడియాపై ప్రభుత్వం విధించిన నిషేధానికి వ్యతిరేకంగా చెలరేగిన నిరసనలు హింసాత్మకంగా మారి దేశాన్ని అట్టుడికిస్తున్నాయి. ఈ తీవ్ర పరిణామాల నేపథ్యంలో ప్రధాని కేపీ శర్మ ఓలీ తన పదవికి రాజీనామా చేశారు. ఆయన దుబాయ్‌లో ఆశ్రయం కోరినట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ప్రభుత్వం ఫేస్‌బుక్, వాట్సాప్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలపై భద్రతా కారణాలతో నిషేధం విధించడంతో ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. దీనికి ప్రభుత్వ అవినీతి కూడా తోడవడంతో ప్రజలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టారు.



ఈ నిరసనలు అనతికాలంలోనే హింసాత్మకంగా మారాయి. మంగళవారం నిరసనకారులు ఏకంగా పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించి నిప్పుపెట్టడంతో పరిస్థితి చేయిదాటిపోయింది. ఈ ఘర్షణల్లో ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు, తన సొంత దేశంలో జరుగుతున్న హింసపై ప్రముఖ బాలీవుడ్ నటి మనీషా కోయిరాలా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారుణ పరిస్థితులపై స్పందించిన మనీషా కోయిరాలా, ఇన్‌స్టాగ్రామ్‌లో రక్తపు మరకలతో ఉన్న ఒక బూటు ఫొటోను షేర్ చేశారు. "ఇది కేవలం ఫొటో కాదు, నేపాల్‌లో జరుగుతున్న హింసకు సాక్ష్యం. ఇది చాలా భయంకరంగా ఉంది" అని ఆమె ఆవేదన చెందారు. నేపాలీ భాషలో పెట్టిన మరో పోస్టులో, "నేపాల్‌కు ఇది ఒక చీకటి రోజు. అవినీతికి వ్యతిరేకంగా, న్యాయం కోసం ప్రజలు గొంతెత్తితే బుల్లెట్లతో సమాధానం దొరికిన రోజు ఇది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు రాజధాని ఖాట్మండూతో పాటు లలిత్‌పూర్, పోఖారా, బుత్వాల్ వంటి కీలక నగరాల్లో కర్ఫ్యూ విధించినప్పటికీ, నిరసనకారులు వెనక్కి తగ్గలేదు. ప్రధాని రాజీనామా చేసినప్పటికీ దేశంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది.

# సీఎం రేవంత్‌కు మతి భ్రమించింది

- **సీఎంను ఎర్రగడ్డ ఆసుపత్రికి పంపాలని రాష్ట్రపతికి విజ్ఞప్తి చేస్తామని వ్యాఖ్య**
- **మొత్తం మంత్రివర్గాన్ని రీకాల్ చేయాలని డిమాండ్**
- **ఎల్లంపల్లి ప్రాజెక్టుపై సీఎం వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమన్న పుట్ట మధు**
- **తెల్లకల్లు తాగిన కోతుల్లా కాంగ్రెస్ మంత్రుల తీరు అంటూ విమర్శ**

హైదరాబాద్, ప్రజాస్వరం

సీఎం రేవంత్ రెడ్డికి మతి భ్రమించిందని, పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయనతో పాటు మొత్తం మంత్రివర్గాన్ని రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం మంథనిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పుట్ట మధు మాట్లాడుతూ..




సీఎం రేవంత్ రెడ్డిని వెంటనే ఎర్రగడ్డ ఆసుపత్రికి తరలించాలని రాష్ట్రపతిని కోరుతున్నట్లు సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి తన ఎత్తుకు తగ్గట్టుగా మెదడు పెంచుకోవాలని పుట్ట మధు హితవు పలికారు. "మీ ఎత్తుకు తగినట్లు మెదడు లేదు, అందుకే అలా మాట్లాడుతున్నారు" అంటూ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మంత్రివర్గం మొత్తం తెల్లకల్లు తాగిన కోతిలా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంపై సీఎం చేసిన వ్యాఖ్యలను పుట్ట మధు తప్పుబట్టారు. 1999లోనే శ్రీపాదరావు చనిపోతే, 2004లో ప్రారంభమై 2016లో పూర్తయిన ప్రాజెక్టును ఆయన ఎలా కడతారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికే కాకుండా ఆయన పక్కన ఉన్న మంత్రులకు కూడా తెలివి లేదని విమర్శించారు. పొడవుగా ఉన్న హరీశ్ రావును రేవంత్ రెడ్డి అవహేళన చేశారని, మరి పొట్టిగా ఉన్న ఆయనకేం తెలివి ఉందని మధు నిలదీశారు. "కాళేశ్వరం కూలిపోలేదు, నీ ముఖమే కూలిపోయింది" అంటూ పుట్ట మధు ఘాటుగా వ్యాఖ్యానించారు. లక్షల క్యూసెక్కుల గోదావరి జలాలు సముద్రం పాలవుతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తెలివిగా వ్యవహరించి, అన్నారం, సుందిల్ల బ్యారేజీలను ఉపయోగించి ప్రజలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.



# వి. ప్రకాశ్‌కు జాగృతి నేతల హెచ్చరిక

- **నోరు అదుపులో పెట్టుకోకపోతే భౌతిక దాడులు తప్పవంటూ వార్నింగ్**

హైదరాబాద్, ప్రజాస్వరం

ఎమ్మెల్సీ కవితపై వ్యక్తిగత విమర్శలు చేస్తే సహించేది లేదని, చెప్పులతో దాడి చేస్తామని జాగృతి నేతలు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తెలంగాణ నీటి వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి. ప్రకాశ్‌ను ఉద్దేశించి వారు ఈ వ్యాఖ్యలు చేశారు. ఆడబిడ్డపై మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోకపోతే భౌతిక దాడులు తప్పవని స్పష్టం చేశారు. జాగృతి కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన మీడియా సమావేశం సందర్భంగా వి. ప్రకాశ్‌పై తీవ్రస్థాయిలో వారు విరుచుకుపడ్డారు. "ప్రకాశ్ ఒక మేధావి కాదు, మేత మేసే ఆవు" అంటూ ఘాటుగా విమర్శించారు. మాజీ మంత్రి హరీశ్ రావు నుంచి ప్యాకేజీ తీసుకుని కవితపై ప్రకాశ్ ఆరోపణలు చేస్తున్నారని, ఎంతకు అమ్ముడుపోయావని నిలదీశారు. కాళేశ్వరం అవినీతి బండారం బయటపడితే తన పేరు కూడా వస్తుందనే భయంతోనే ప్రకాశ్, కవితను లక్ష్యంగా చేసుకుని మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆ ప్రాజెక్టులో హరీశ్ రావు, మేఘా కృష్ణారెడ్డితో పాటు ప్రకాశ్‌కు కూడా వాటా ఉందని, అందుకే ఆయనలో ఆందోళన మొదలైందని అన్నారు. నీటి వనరుల సంస్థ చైర్మన్‌గా ఆయన వాటా ఎంత అని ప్రశ్నించారు. గతంలోనూ వి. ప్రకాశ్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని జాగృతి నేతలు ఆరోపించారు. అభ్యుదయ వాది మారోజు వీరన్న హత్యలో ఆయన పాత్ర ఉందని, చంద్రబాబుతో కుమ్మక్కై నిధులు కాజేశారని విమర్శించారు. అంతేకాకుండా, దేవేందర్ గౌడ్, కపిలవాయి దిలీప్‌లతో కొత్త పార్టీలు పెట్టించి తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చాలని చూశారని మండిపడ్డారు. సొంత చెల్లెలిపై ఇలాంటి ఆరోపణలు వస్తుంటే కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదని జాగృతి నేతలు ప్రశ్నించారు. ఈ విషయంలో ఆయన మౌనం బాధ కలిగిస్తోందని వ్యాఖ్యానించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999